# క్షమా

**-మహర్షి**

రిక్షాలో వెళుతున్న ఆ జంటను చూసి సావిత్రి హృదయం భగ్గుమంది. ఆమె హృదయం అలా భగ్గుమని మండటానికి కారణం ఉంది. ఆ రిక్షాలో వెళుతున్న ఇద్దరిలో ఒకరి ఆమె భర్తే.

నిజం! మరి అగ్నిసాక్షిగా తాళి కట్టించుకున్న భార్య తనిక్కడ ఉండగా ఎవరో అపరిచిత అమ్మాయిని వెంటేసుకుని షికార్లు కొడుతున్న భర్తను చూస్తే ఏ భార్య హృదయం మాత్రం భగ్గుమనదు.

అప్పటికప్పుడు భర్తను రిక్షాలో నుంచి బయటకు లాగి నాలుగు దులిపేద్దామనుకుంది. ఊహు! అంత సాహసం చెయ్యలేక, ఇక బజార్లో ఉండాలనిపించక రిక్షా మాట్లాడుకుని ఇంటికొచ్చింది. రిక్షావాడికి డబ్బులిచ్చి ఇంట్లోకెళ్లి బెడ్‌మీద వాలిపోయింది. అప్పుడొచ్చాయి కన్నీళ్లు అప్పటివరకూ ఆపుకున్న దుఃఖం కట్టలు తెగినట్టు!

ఎంత మోసం! ఎంత దగా! ఆయనగారు ఓ అమ్మాయిని వెంటేసుకుని తిరిగినట్టే తను ఓ అబ్బాయిని వెంటేసుకుని తిరిగితే ఆయనగారు సహించగలరా? అప్పటికప్పుడు 'బరితెగించింది' అని సర్టిఫికెట్ ఇచ్చి, పుట్టింటికి తరిమేసి విడాకులు కోసం లాయర్ దగ్గరకు పరిగెత్తరూ.

మరి తనెందుకు ఆ పని చెయ్యలేక పోతోంది. ఆ ఆలోచనే ఆమె దుఃఖాన్ని అధికం చేసింది. కేవలం తను ఆడదై పుట్టినందు వల్ల కదా భర్త అనబడే మగాడు ఏం చేసినా మౌనంగా భరించాల్సి వస్తోంది. ఊహు! రాజీపడాల్సిన అవసరం తనకు లేదు. ఏం... భర్త అయినంత మాత్రాన ఇష్టం వచ్చినట్టు తిరిగే హక్కు ఆయనకు ఎక్కడుంది? ఆమె అలా ఆలోచిస్తూనే తమ మొదటి రాత్రిని జ్ఞప్తికి తెచ్చుకుంది.

★ ★ ★

శోభనం గది అది.

తలుపు మూసుకున్న శబ్దానికి వెనక్కి తిరిగి చూసింది సావిత్రి. తలుపు అవతలి వైపు నుంచి కిలకిలమంటూ కొంతమంది ఆడవాళ్ల గొంతులు వినిపించాయి. తనను అంతవరకు ఏడిపించి ఏడిపించి ఆ గదిలోకి నెట్టి తలుపేసి వెళుతూ వెళుతూ నవ్వుకుంటున్న ఆడవాళ్ల గొంతులు అవి. అసలు శోభం అంటేనే ప్రతి ఒక్కరికి అదో ఆనందం. అనుభవించిన వారికి, అనుభవించ బోయే వారికి అందరికీ థ్రిల్లే!

తను ఇటువైపు కూర్చుని ఉంటే అటువైపు చూస్తూ నిలబడ్డ సావిత్రిని చూసి చిన్నగా నవ్వుకుంటూ మంచం మీద నుంచి లేచి నిలబడ్డాడు కృష్ణప్రసాద్! వారం రోజుల క్రితమే వాళ్లిద్దరి పెళ్లి జరిగింది. మరోసారి సావిత్ర వైపు పరీక్షగా చూశాడు.

తెల్ల చీరలో, చేతిలో పాలగ్లాసుతో నిలబడి ఉన్న సావిత్రి మిస్ ఇండియా 'క్యాబ్'లా ఉంది. ఆ క్షణంలో ఆమెను చూస్తుంటే కృష్ణప్రసాదుకు అనిపించింది ఒక్కటే! బ్రహ్మ తన మీద ప్రేమతో ఆమెను తనకు కానుకగా సృష్టించాడేమో!

కొందరికి అందం కళ్లలో ఉంటుంది. మరికొందరికి నడుము వొంపులో ఉంటుంది. ఇంకొందరికి అందమంతా కంఠం కింది భాగంలో కేంద్రీకృతమై ఉంటుంది. ఆ అమ్మాయికెందుకో ప్రతి అవయవంలోనూ అందం ఉంది. ఆ అందం కవ్విస్తూ ఉంది. కాంక్షగా చూస్తుంది.

అప్పటికే ఆమెను సమీపించిన కృష్ణప్రసాదు, ఆమె భుజాలు చుట్టూ చేతులేసి ఆమెను తనవైపుకు తిప్పుకునే ప్రయత్నం చేస్తూ చెవిదగ్గర గుసగుసగా అన్నాడు.

''తలుపు మూసుకున్న శబ్దానికే ఇంత భయపడుతున్నావు. ఇక అసలు కార్యక్రమం మొదలు పెడితే ఎలా ఉంటావో?''


ఆ మాటలు అందంగా నవ్వి అంది సావిత్రి. ''భయమా? నేనంత పిరికిదాన్ని కాను''.

''శోభనం అంటే భయపడని అమ్మాయిల్ని నమ్మకూడదు''

ఆమెను మరింత తనకేసి హత్తుకున్నాడు. అతని మెడవంపులో మొహం దాచుకుని అనుకుంది సావిత్రి.

''శోభనం అంటే ఏముందండీ భయపడటానికి. నేనేమో పాలగ్లాసుతో లోపలికొస్తాను. వెనకనుంచి తలుపులు మూసుకుంటాయి. అంతవరకు ఈ రాత్రి ఎలా గడపాలి, ముందుగా ఎలా ప్రారంభించాలి లాంటి ఆలోచనలతో గడిపిన మీరు నన్ను చూడగానే చిరునవ్వుతో మంచం మీద నుంచి లేచివచ్చి నా మీద ఎంతో ప్రేమ కురిపిస్తూ, ఎంత అందంగా ఉన్నావు సావిత్రీ, నీ అందం ముందు రంభ, ఊర్వశి, మేనక వీళ్లెందుకు పనికిరారంటే నమ్ము అంటూ ఓ పచ్చి అబద్ధపు కొటేషన్‌ని చెబుతారు. నేనేమో ఆ మాటలకు మా ఆయన రంభ, ఊర్వశి, మేనక వీళ్లనెప్పుడు చూశారా అని కూడా ఆలోచించకుండా పరవశించి పోతాను.

అలా పరవశంలో మునిగివున్న నన్ను చిన్నగా మంచం దగ్గరకు తీసుకెళతారు. కిటికీలోనుంచి చూస్తే చంద్రుడు కనిపిస్తాడు. పక్కమీది మల్లెలు చూస్తే తొందర పడతాయి. గోడమీది గడియారం ఆలస్యం అమృతం విషం అంటుంది. అప్పటికే మంచం మీద నా పక్కన చోటు చేసుకున్న మీరు ఈ బట్టలు నీవంటికి అందాన్నివ్వటం లేదు. తీసేయి అంటారు. సిగ్గుతో



నేనేమో కుదరదు అంటాను. మీరేమో బుంగమూతి పెట్టి నీ అందాలన్నీ చూడొద్దా అంటారు. కావాలంటే ముందు ముందు చూద్దురుగాని ఇప్పుడు మాత్రం కుదరదు అంటాను. కొద్దిసేపు మురిపాల తర్వాత లైట్ ఆరిపోతుంది. చిక్కటి చీకటి మిగులుతుంది. ఆ చీకట్లో మీరూ నేను...''

అంతవరకు ఆలోచించి పక్కున నవ్వింది సావిత్రి. ఇదంతా పైకి మాట్లాడటమే! సభ్య సమాజం ముక్కు మీద వేలేసుకుని నన్నీసడించుకోదూ. సావిత్రి నవ్వటం చూసి అతనన్నాడు.

''ఎందుకానవ్వు?''

''ఊరికే నవ్వాను''. సిగ్గుల మొగ్గలవుతూ చెప్పింది సావిత్రి.

''అలా అంటే కుదరదు. కారణం లేకుండా ఎవరూ నవ్వరు. ఎందుకు నవ్వావో చెప్పు'' ఆమె చుబుకం పట్టుకుని అడిగాడు కృష్ణప్రసాదు.

''ఊహు! ఊరికే'' ఆమెకేం చెప్పాలో నిజంగానే అర్థంకావటం లేదు. అప్పటికే ఆలస్యమైందని గ్రహించిన కృష్ణప్రసాద్ ''అయితే సరే! మనిద్దరం ఇలాగే వాదించుకుంటూ కూర్చుంటే పైన ఆకాశం మీద చంద్రుడు వెళ్లి సూర్యుడొస్తాడు. ఇక అంతే సంగతులు'' అంటూ ఆమెను మంచం దగ్గరకు తీసుకెళ్లాడు. మంచం మీదకు చేరుకోగానే ఆమెను చేతుల్లోకి తీసుకోబోతుండగా చిలిపిగా నవ్వుతూ ఆమె అంది ''గడియ వెయ్యలేదు''

అతను ఒక్కసారిగా ఆమె మీద నుంచి లేచి విసురుగా తలుపుకేసి నడిచాడు. సావిత్రి హాయిగా నవ్వుకుంది బయట వాతావరణం చల్లగాను, గదిలో వెచ్చగాను ఉన్నట్టు అనిపించింది. అతను గడియ వేసి వచ్చేసరికి సావిత్రి రెండు కాళ్లచుట్టూ చేతులు చుట్టి కూర్చుని ఉంది. అతను వచ్చిన తన పక్కన కూర్చోగానే అంది.

''చూడండీ! మనిద్దరం కొత్త జీవితంలోకి అడుగు పెట్టబోతున్న ఈ శుభ సమయంలో మీరు నాకో మాటివ్వాలి''.

ఆమెవైపు విస్మయంగా చూస్తూ ''ఏం మాటివ్వాలి'' అన్నాడు కృష్ణప్రసాదు. అతని చేతుల్ని తన రెండు చేతుల మధ్య తీసుకుని ఆమె అంది. ''మీరు ఇంతకు ముందు ఎలా ఉన్నారో... ఎవర్ని ప్రేమించారో అవన్నీ నేనడగను. ఇకనుంచి మాత్రం మీరు శ్రీరామచంద్రుడిలా ఉండాలి. పరాయి స్త్రీల వైపు కన్నెత్తి కూడా చూడకూడదు. అలా అని నాకు మాటివ్వండి''.

''ఇప్పుడా...'' చిలిపిగా నవ్వుతూ అన్నాడు కృష్ణప్రసాదు.

''అవును. ఇప్పుడే'' స్థిరంగా అంది సావిత్రి.

అతను ఇబ్బందిగా మొహం పెట్టి ఇక తప్పదన్నట్టుగా ఆమె చేతిలో చెయ్యి వేశాడు. ఆ తర్వాత ఆ చేతిని అలాగే ఆమె మెడ కిందకు పోనిచ్చి ఆమెను తనవైపుకు లాక్కున్నాడు. ఇద్దరి శరీరాల్లోనూ, మనసుల్లోనూ కోరిక ఒకటే అయినా, ఆ కోరిక ప్రదర్శించటంలో తేడాలో ఆమె పూర్తిగా అతని కిందకు వచ్చేసింది. ఆమె మీద అతను పువ్వు మీద తుమ్మెదలా ఉన్నాడు.

ఆమెకు సుఖంగా ఉంది. సంతోషంగా ఉంది. సుఖం అతని శరీర స్పర్శ వల్ల. సంతోషం అతను తనకిచ్చిన మాట వల్ల.

★ ★ ★

ఒక్కసారిగా గతం నుంచి తేరుకుంది సావిత్రి. తన భర్త తనకు మాత్రమే సొంతమనుకుంది. కానీ, ఇప్పుడు జరిగిందేమిటి? ఆమెకెందుకో ఇక అక్కడ ఉండాలని అనిపించలేదు. చిన్నగా మంచం మీద నుంచి లేచి కాగితం కలం అందుకుని రాయటం మొదలుపెట్టింది.

ప్రియమైన భర్తకు...

మీ భార్య సావిత్రి ప్రేమతో రాయునది. మీరు మన మొదటి రాత్రి నాకిచ్చిన మాటను మరచి మరో అమ్మాయితో షికార్లు తిరగటం నేను కళ్లారా చూశాను. మనసులో నాకు మాత్రమే స్థానముంది అనుకున్నాను. ఇప్పుడది కేవలం నా భ్రమ మాత్రమే అని తెలిసింది. అందుకే మీ హృదయంలో లేని నేను మీ ఇంట్లో కూడా ఉండలేక నా పుట్టింటికి వెళుతున్నాను. మీరు మీ మనసుకు నచ్చిన అమ్మాయితో హాయిగా ఉండండి.

ఇట్లు
ఎప్పుడూ మీ సుఖాన్నే కోరుకునే
మీ భార్య
సావిత్రి.

ఆ తర్వాత సూట్‌కేసులో బట్టలు సర్దుకుని రాసిన ఉత్తరాన్ని మరోసారి చదివి దాన్ని టేబుల్ మీద పెట్టి, దానిమీద తమ పెళ్లినాటి ఫోటో పెట్టి బయటకు కదిలింది.

★ ★ ★

రిక్షా దిగి సూట్‌కేసు చేత పట్టుకుని ఇంట్లోకొస్తున్న కూతుర్ని చూసి ఆప్యాయంగా ఎదురొచ్చి ''అల్లుడుగారు రాలేదా?'' అంటూ ప్రశ్నించింది. సావిత్రి కన్నతల్లి. కన్నకూతురు వచ్చిందన్న ఆనందం కంటే తోడుగా అల్లుడు కూడా రాలేదన్న బాధే ఆమె ముఖంలో ఎక్కువ కనిపించింది.

''రాలేదు'' కోపంగా సమాధానమిచ్చి విసురుగా లోపలికెళ్లింది సావిత్రి. అప్పటికే ఇంటిదగ్గర భార్యాభర్తల మధ్య ఏదో గొడవ జరిగి ఉంటుందని అర్థం చేసుకుంది సావిత్రి తల్లి. ఆ తర్వాత కూతురి వెనకే నడిచి కాళ్లు చేతులు కడుక్కుంటున్న కూతురివైపు అనుమానంగా చూస్తూ అనునయంగా అడిగింది ''ఏం జరిగిందమ్మా! అల్లుడు గారేరి?''.

ఆ మాటలకు సావిత్రి కోపం తారాస్థాయి కందుకుంది. నిప్పులు చెరగే కళ్లతో తల్లివైపు చూస్తూ కసిగా అంది.

''అల్లుడుగారు! అల్లుడుగారు! ఏం? అల్లుడుగారు రాకపోతే మనం బతకలేమా? ఆయనగారేమన్నా అవతార పురుషుడా?''

ఆ మాటలకు నెత్తిన బాంబు పడ్డట్టు అదిరిపడింది సావిత్రి తల్లి. ఆ తర్వాత కూతురికి దగ్గరగా నడిచి అంది.

''వారం రోజుల క్రితమే కదా మీ నాన్నగారు మీ



## ప్రేమించను

విన్నగాక మొన్న నటి అయినా తన పొడగరి సొగసులతో అందరినీ ఆకట్టుకున్న ప్రేమ తన పెళ్లి విషయం ప్రస్తావిస్తే నేను ఎవరినీ ప్రేమించను కేవలం అభిమానిస్తాను. నాకు నచ్చిన మగవాడిని నా పొడుగుకు సరిపోయే అందగాడిని ఇట్టే ఎన్నుకుని పెళ్లి చేసుకుంటాను అంటున్నది. ఆ ఆరడుగుల అందగాడు త్వరగా దొరికితే బాగుంటుంది. ప్రేక్షకులు ఊపిరి పీల్చుకుంటారు. 'కన్నడం' పిల్లకి త్వరగా పెళ్లి కుదరాలని తెలుగు ప్రేక్షకుడి కోరిక!

-కృష్ణాజీ

దగ్గర్నుంచి వచ్చి మీరిద్దరూ ఎంతో అన్యోన్యంగా ఉంటున్నారని, అల్లుడు గారెంతో బుద్ధిమంతుడని, అలాంటి భర్త దొరకడం నిజంగా మనవమ్మాయి అదృష్టమని చెప్పారు. ఇంతలోనే ఏమైందీ?''

''ఆ... బుద్ధిమంతులు! ఆయనగారి బుద్ధి ఎలాంటిదో ఇప్పుడు తెలిసింది నాకు. ఆయన శ్రీరామచంద్రుడనుకొని పొరపాటు పడ్డాను. అపర శ్రీకృష్ణ అవతారం అనుకో'' అంటూ జరిగింది వివరించి చెప్పటం మొదలు పెట్టింది.

కూతురు చెప్పిందంతా సావధానంగా విన్న ఆమె - కూతురికెలా నచ్చచెప్పాలో అర్థంకాక, ఆ సమయంలో ఊరకుండిపోయింది.

మరో రెండు రోజులు గడిచాయి.

ఆ రెండు రోజులూ ఇంట్లో ఎవరూ కృష్ణప్రసాదు పేరెత్తలేదు. ఆ మరుసటి రోజు మాత్రం బెడ్‌మీద వాలి ఏదో పుస్తకం చదువుకుంటున్న సావిత్రి తలుపు దగ్గర శబ్దమయ్యే సరికి తలెత్తి చూసింది. ఎదురుగా కన్నతల్లి నిలబడి ఉండటంతో మంచం మీదనుంచి లేచి కూర్చుంది.


సావిత్రి పక్కనే వచ్చి కూర్చుని కూతురి తలపై చేతినుంచి ఆప్యాయంగా చెప్పటం మొదలుపెట్టింది సావిత్రి తల్లి.

''చూడమ్మా! ఈ విషయం నీకెలా చెప్పాలో నాకర్థం కావటం లేదు. ఒక కన్నతల్లిగా కూతురి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చెప్పక తప్పడం లేదు. నీ భర్త ఎవరో పరయి స్త్రీ తిరుగుతున్నాడని తెలిసి ఏకంగా భర్తనే దూరం చేసుకుంటున్నావు నువ్వు. పాతిక సంవత్సరాల క్రితం నేను కూడా నీలాగే ఆలోచించి ఉంటే... ఈరోజు నీకన్న తండ్రి నీ దగ్గరుండే వారు కాదు.

ఏవో పుస్తకాలు చదివి స్త్రీ, పురుషులు సమానమని, మనం తప్పు చేస్తే వాళ్ల సవరించనప్పుడు వాళ్ల తప్పు చేసినప్పుడు మాత్రం మనమెందుకు సహించాలని, ఇలాంటివన్నీ కథల్లో చదవటానికైతే బాగుంటాయి కాని, నిజ జీవితంలో స్త్రీకి ఎంతమాత్రం పనికిరావు.

నేను తప్పు చెయ్యనప్పుడు నా భర్త మాత్రం ఎందుకు తప్పు చెయ్యాలనే ఆలోచిస్తున్నావు కాని, 'అమ్మా' అనే పదానికున్నంత విలువ పవిత్రత 'నాన్న' అనే పదానికి ఎందుకు లేవో ఒక్కసారి ఆలోచించు.

మరి అలాంటి పవిత్ర భావమైన 'అమ్మే' నాన్నతో పోటీపడి ప్రవర్తించే పనైతే... 'అమ్మ' అనే పదానికింత విలువ, పవిత్రత ఎందుకు?''




ఆ తర్వాత చెప్పటం కొంచెం ఆపి మళ్లీ చెప్పటం మొదలుపెట్టింది. సావిత్రి మాత్రం ఇదంతా మౌనంగా వింటోంది. వాదనకక్కడ ఆస్కారం లేదు.

''స్త్రీకి క్షమించ గలిగే గుణం, ఓర్పు, సహనం దేవుడిచ్చిన వరాలు. ఆ సహనాన్ని, ఓర్పును మరిచిపోయి నీలా భర్త తిరుగుబోతని, తాగుబోతని భర్తల్ని వదిలేసిపోతే మన వివాహ బంధంలో నూటికి తొంభై తొమ్మిది స్త్రీలు పెళ్లి చేసుకొని కూడా పుట్టింట్లో ఉండాల్సి వస్తుంది.

కన్నతల్లిగా చెపుతున్నాను నా మాట విని నీ భర్త దగ్గర కెళ్లు. వెళ్లి అసలు కథేంటో తెలుసుకుని నీ భర్తలో మార్పు తీసుకురావటానికి ప్రయత్నించు.

అంతేకాని అలా భర్తనొదిలేసి, ఇంటినొదిలేసి పుట్టింటికి రావటం మంచిది కాదు. రెండు రోజుల్లో మీ నాన్నగారు వచ్చి అబ్బాయికి నచ్చచెపుతారు''.

ఆమె ఇంకా ఏదో చెప్పబోతుండగా బయట నుంచి పోస్ట్ అనే కేక వినిపించింది. సావిత్రి తల్లి బయటకెళ్లి పోస్ట్‌మెన్ అందించిన ఉత్తరం అందుకుని ఫ్రమ్ అడ్రస్ దగ్గర కృష్ణప్రసాద్ అని ఉండటంతో ఆనందంతో ఉత్తరాన్ని తీసుకొచ్చి సావిత్రి చేతికిచ్చి ''అబ్బాయి దగ్గర్నుంచి వచ్చింది. ఏం సారాడో చదువుకో'' అని చెప్పి బయటకెళ్లి పోయింది.

సావిత్రి ఉత్తరం చించి జాగ్రత్తగా చదవటం మొదలు పెట్టింది. ఒక్కో అక్షరం చదువుతున్న కొద్దీ ఆమెలో టెన్షన్ ఎక్కువయింది.

మైడియర్ సావిత్రీ!

రిక్షాలో నేను మరో అమ్మాయితో ఉండటం చూసి నామీద అసహ్యంతో పుట్టింటికి వెళ్లిపోయావు. నువ్వలా చేస్తావని నేను కలలో కూడా ఊహించలేదు. నిజానికి నువ్వు నా పక్కన చూసింది నా స్నేహితుడి భార్యని.

నా ఫ్రెండ్ రాజేష్ బిజినెస్ పనిమీద అర్జంటుగా వైజాగ్ వెళ్లాల్సి వచ్చింది. అతని భార్యకు సడన్‌గా పురిటి నొప్పులు మొదలవ్వటంతో నేను హాస్పిటల్‌కు తీసుకెళ్లవలసి వచ్చింది.

ఒక స్నేహితుడ్ని నమ్మి నా స్నేహితుడు తన భార్యను నాకప్పగించి వెళ్లాడు. మరి నువ్వేమో నా భార్యవై ఉండి కూడా నన్ను నమ్మలేక పోయావు. అదే నన్నెక్కువ బాధపెట్టింది. పవిత్రత అనేది నా భార్యకెంత ముఖ్యమో నాకూ అంతే ముఖ్యం అని నమ్మే వ్యక్తుల్లో నేను మొదటివాడ్ని. మన శోభనం రాత్రి నేను నీకిచ్చిన మాటను ఇంకా మరచిపోలేదు.

జరిగిపోయిందేదో జరిగిపోయింది. ఉత్తరం చూసిన వెంటనే బయలు దేరిరా! నీ రాకకోసం వేయి కళ్లతో ఎదురు చూస్తూ..

నీ భర్త

కృష్ణప్రసాద్

ఉత్తరం పూర్తిగా చదివిన సావిత్రి ఆనందం పట్టలేక ఉత్తరాన్ని గాఢంగా ముద్దు పెట్టుకుంటూ ''అమ్మా'' అంటూ పెద్దగా అరిచింది. ఆ తర్వాత రెక్కలొచ్చిన పక్షే అయింది.

★